కొనసాగుతున్న ముసురు

పాడేరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశ్చిమబంగా ప్రాంతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సోమవారం మన్యంలో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సాధారణ వాతావరణంతో ఎండ కాసింది. కానీ ఆ తరువాత నుంచి వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమై జల్లులతో కూడిన వర్షం మొదలైంది. అయితే భారీ వర్షం కురవకపోడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. కొన్ని రోజులుగా ఏజెన్సీలో ముసురు వాతావరణం కొనసాగుతుండడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి.

మన్యంలో కాఫీ ఘుమఘుమలు



గుత్తులుగా కాసిన కాఫీ పండ్లు

- వర్షాలు అనుకూలించడంతో ఎకరానికి 50 కిలోలు అదనంగా దిగుబడి వస్తుందని అంచనా
- కాఫీ తోటలు కళకళ
- ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 42 వేల ఎకరాల్లో తోటలు
- మొత్తం లక్షా 52 వేల ఎకరాల్లోని తోటల్లో 80 వేల టన్నుల పండ్లు వచ్చే అవకాశం
- 15 వేల టన్నుల క్లీన్ కాఫీ ఉత్పత్తి అయ్యే చాన్స్



పాడేరు మండలం గుర్రగరువు ప్రాంతంలో విరగ్గాసిన కాఫీ మొక్క

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో ఈ ఏడాది కాఫీ విరగ్గాసింది. దీంతో కాఫీ తోటలను ఎక్కడ చూసినా పరువానికి వచ్చిన పచ్చని కాయలతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షాలు అనుకూలంగా ఉండడంతో కాఫీ పంట విరగ్గాసిందని కాఫీ విభాగం అధికారులు అంటున్నారు. ఫలితంగా పంట నష్టపోకుండా ఉండడంతో పాటు దిగుబడి సైతం 50 నుంచి 60 కిలోలు పెరుగుతుందని భావిస్తున్నారు.

ఏజెన్సీ పదకొండు మండలాల్లో ప్రస్తుతం 2 లక్షల 42 వేల ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. వాటిలో లక్షా 52 వేల ఎకరాల్లోని తోటల్లో 80 వేల టన్నుల కాఫీ పండ్ల దిగుబడి వస్తుందని ఒక అంచనా. వాటిని శుద్ధి చేస్తే 15 వేల టన్నుల క్లీన్(పార్చిమెంట్) కాఫీ ఉత్పత్తి అవుతుంది. అలాగే ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో పంట సైతం కొంచెం తొందరగా కోతకు వస్తుందని రైతులు అంటున్నారు. వచ్చే నెల నుంచి పలు చోట్ల కాఫీ పండ్ల సేకరణ ప్రారంభించేందుకు పలువురు రైతులు సన్నాహాలు చేస్తుండగా, మరో నెలన్నర తరువాత కాఫీ పండ్ల సేకరణ ముమ్మరంగా జరుగుతుందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది కాఫీకి అనుకూలించిన వర్షాలు

ఏజెన్సీలోని కాఫీ తోటలకు ఈ ఏడాది వర్షాలు బాగా అనుకూలించాయి. ప్రతి ఏడాది మార్చి రెండో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు కాఫీ పూత పూస్తుంది. ఆ సమయంలో వర్షాలు కురిస్తేనే పూత బలంగా నిలబడి పిందెకు అవకాశం ఉంటుంది. వర్షాలు కురవకుండా మంచు కురిస్తే పూత మాడిపోయి పిందె దశకు రాని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే. జూన్, జూలై నెలల్లో సైతం వర్షాలు అనుకూలించాయి. ఆఖరుకు పిందె బలంగా ఉన్న ఆగస్టు నెలలో సైతం వర్షాలు కురవడంతో దిగుబడికి మరింత అవకాశం కలిగిందని కాఫీ రైతులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరానికి కనీసం 50 కిలోలు అదనపు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏజెన్సీలో 1989 నుంచి కాఫీ తోటల పెంపకం

గిరిజనులు పోడు వ్యవసాయంపై ఆధారపడి అడవులను నాశనం చేయకుండా ఉండేందుకు గానూ 1989లో కాఫీ సాగును ప్రభుత్వం గిరిజనులకు పరిచయం చేసింది. దీంతో 1989 నుంచి 2002 వరకు కేవలం 32,072 ఎకరాల్లో మాత్రమే కాఫీ తోటలు అభివృద్ధి జరగ్గా, 2003 నుంచి 2008 వరకు 64,265 ఎకరాల్లో కాఫీ తోటలు వేశారు. ఆ తరువాత 2009లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా కాఫీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. దీంతో 2009 నుంచి 2016 వరకు 61,684 ఎకరాల్లో, 2016 నుంచి ఇప్పటి వరకు 84 వేల ఎకరాల్లో కాఫీని అభివృద్ధి చేశారు. ఈ లెక్కన 1989 నుంచి 2024 వరకు ఏజెన్సీ వ్యాప్తంగా 2 లక్షల 42 వేల 21 ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. అయా తోటల ద్వారా 2 లక్షల 36 వేల 618 మంది గిరిజన కాఫీ రైతులు లబ్ధి పొందుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కాకుండా గిరిజన రైతులు స్వయంగా తమ వారసత్వ భూముల్లో వేసుకున్న సుమారుగా 30 వేల ఎకరాలు కలిపి మొత్తం ... మిగతా 8వ పేజీలో

నత్తనడకన రిసార్టుల ఆధునికీకరణ



అరకులోయలో పున్నమి రిసార్టు రూమ్‌ల్లో టైల్స్ వేస్తున్న దృశ్యం

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మయూరి, పున్నమి హిల్, హరిత రిసార్టుల్లో పనులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణం
- మరో మూడు వారాల్లో పర్యాటక సీజన్ ప్రారంభం
- అప్పటిలోగా పనులు పూర్తి కావడం అనుమానమే..



మయూరి హిల్ రిసార్టు ప్రాంగణంలో అమీబా కాటేజీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అరకులోయ, సెప్టెంబరు 16:

అరకులోయలోని మయూరి, పున్నమి హిల్ రిసార్టుల్లో చేపట్టిన ఆధునికీకరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పూర్తి చేయాల్సిన రెనోవేషన్ పనులు ఆరు నెలలైనా పూర్తి కాలేదు. ఈ పనుల తీరును పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్న పర్యాటక సీజన్‌లో ఆ శాఖ భారీగా ఆదాయాన్ని కోల్పోనున్నది.

అరకులోయలోని మయారి హిల్ రిసార్టు, పున్నమి హిల్ రిసార్టుల గదులను రెనోవేషన్ చేసేందుకు పర్యాటక శాఖ రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను మార్చి నెలలో ఏపీటీడీసీ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. రెండు నెలల్లో రెనోవేషన్ చేసి గదులను అందజేస్తామని ఏపీటీడీసీ అధికారులు ప్రకటించినా ఆరు నెలలైనా పూర్తి చేయలేదు. నాటి నుంచి నేటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో నాలుగు నెలలకు సంబంధించి రూమ్‌ల ఆదాయాన్ని పర్యాటక శాఖ కోల్పోయింది. మరోవైపు అక్టోబరు నుంచి పర్యాటక సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఇప్పటికే పర్యాటకులు రిసార్టులలో బస చేసేందుకు గదులను ముందస్తు బుకింగ్స్ చేసుకుంటున్నారు. అయితే సీజన్ నాటికి రెనోవేషన్ పనులు పూర్తి చేయకుంటే ముందస్తుగా గదులను బుక్ చేసుకున్న వారికి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రిసార్టుల నిర్వహణను పర్యాటక శాఖ అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా ఒక్కసారి కూడా అరకులోయను సందర్శించిన పాపాన పోలేదు. గత ప్రభుత్వం చివరి దశలో రిసార్టుల రెనోవేషన్‌కు నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు వేగవంతం అవుతాయని అంతా భావించారు. అయితే ఉన్నత స్థాయి అధికారులు పనుల పురోగతిపై దృష్టి సారించలేదు. దీంతో ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాల్సిన పనులు సెప్టెంబరు నెల సగం అయినా ఇంకా కొనసాగుతుండడం అధికారుల పర్యవేక్షణ లోపమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటక శాఖ ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించకుంటే సీజన్‌కు పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. హరిత వేలీ రిసార్టులో 20 రూమ్‌లతో కూడిన పాత యాత్రినివాస్ భవనం రెనోవేషన్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. సీలింగ్, వైరింగ్, టైల్స్ పనులు చేస్తున్నారు. మయారి హిల్ రిసార్టులో క్రాఫ్ట్ విలేజ్‌లో కాటేజీల రెనోవేషన్ పనులు ప్రారంభించినా అక్కడ పరిస్థితి అంతే.. వైరింగ్, టాయ్‌లెట్స్ పనులు జరిగాయి. ఐటీడీఏ నిర్మించిన అమీబా కాటేజీల మరమ్మతు పనులు ప్రారంభించారు. వీటిలోనూ టాయ్‌లెట్స్ పనులు పూర్తికాగా, వైరింగ్, ఇతరత్రా పనులు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా సగం కాటేజీల్లో మాత్రమే పనులు ప్రారంభించారు. మిగిలిన అమీబా కాటేజీల జోలికి వెళ్లలేదు. ఏపీటీడీసీ ఉన్నతాధికారులు రెనోవేషన్ పనులపై దృష్టి సారించి సీజన్‌లో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చే విధంగా రూమ్‌లను సిద్ధం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. పర్యాటకులకు భద్రతతో కూడిన రిసార్టులు అందుబాటులో లేవనే విమర్శలున్నాయి.

ఇద్దరు ఆశ్రమ విద్యార్థులు మృతి

- నాలుగు రోజుల క్రితం సప్పర్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థికి అనారోగ్యం
- వైద్యం చేయించకుండా ఇంటికి పంపేసిన ఉపాధ్యాయులు
- రహదారి సౌకర్యం కూడా లేని గ్రామంలో బాలుడికి కష్టాలు
- డోలీలో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- ఆర్‌వీనగర్ ఆశ్రమ విద్యార్థిని పచ్చకామెర్లతో మృతి



గొల్లోరి మోహన్ దాస్ (ఫైల్ ఫొటో)



దారమల్లేశ్వరి మృతదేహం

సీలేరు, సెప్టెంబరు 16: జిల్లాలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఇద్దరు మృతి చెందారు. జీకేవీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి గొల్లోరి మోహన్‌దాస్, అదే మండలంలోని ఆర్‌వీనగర్ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని జంపరంగి దారమల్లేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. జీకేవీధి మండలంలోని దోనుగుమ్మల గ్రామానికి చెందిన గొల్లోరి మోహనదాస్ (16) సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థికి నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చింది. అయితే ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తీసుకువెళ్లకుండా రహదారి సౌకర్యం కూడా లేని ఆ విద్యార్థిని స్వగ్రామం పంపించేశారు. ఆదివారం అర్ధరాత్రి ఆ బాలుడికి జ్వరం తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు డోలీ కట్టి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సంపంగిగొంది గ్రామానికి బయలుదేరారు. ఈలోగా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఆ బాలుడు మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా నెల రోజుల వ్యవధిలో సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, ఇద్దరూ పదో తరగతి చదువుతుండడం గమనార్హం.

పచ్చకామెర్లతో విద్యార్థిని మృతి

గూడెంకొత్తవీధి: జీకేవీధి మండలంలోని ఆర్‌వీనగర్ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని జంపరంగి దారమల్లేశ్వరి పచ్చకామెర్లతో మృతి చెందింది. ఈ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆ బాలిక ఈ నెల 13వ తేదీన పచ్చకామెర్లతో అస్వస్థతకు గురైంది. పాఠశాల డిప్యూటీ వార్డెన్ బాలికను 14వ తేదీన చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. స్థానిక మెడికల్ సూపరింటెండెంట్ జి.ప్రభావతి బాలికకు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించారు. అయితే బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. బాలిక మృతదేహానికి సాయంత్రం మొండిగెడ్డ పంచాయతీ గుడివాడలో అంత్యక్రియలు నిర్వహించారు.

మ్యూజియం నిర్మాణానికి బ్రేక్

- ఇసుక కొరతతో రెండు నెలలుగా ముందుకు సాగని పనులు
- గత వైసీపీ ప్రభుత్వంలో నిధుల విడుదలలో తీవ్ర జాప్యం
- కేంద్రం వాటా రూ.7.5 కోట్లు నిధులు విడుదల చేస్తే రాష్ట్రం నుంచి నిల్
- గిరిజన మంత్రిత్వ శాఖ సీరియస్ కావడంతో కేంద్ర నిధులు కాంట్రాక్టర్‌కు చెల్లింపు
- గడువు ముగిసినా కొలిక్కిరాని నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఇసుక కొరతతో రెండు నెలలుగా శ్లాబ్ పూర్తికాక ఐరన్ కట్టడాలతో దర్శనమిస్తున్న రెస్టారెంట్

చింతపల్లి, సెప్టెంబరు 16: మండలంలోని లంబసింగి(తాజంగి)లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలకు బ్రేక్ పడింది. ఇసుక కొరత కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. ప్రధాన భవనాలు శ్లాబ్ దశలో నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేయడం వల్ల రెండేళ్లలో పూర్తి కావాల్సిన భవనాలు ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు పునఃప్రారంభమైనా ప్రస్తుతం ఇసుక కొరత వల్ల పనులకు ఆటంకం ఏర్పడింది. దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకులను గడగడ వణికించిన ఆదివాసీ పోరాటయోధుల చరిత్ర భావితరాలకు తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లో రాష్ట్రానికి 'గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం' మంజూరు చేసింది. మ్యూజియం నిర్మాణానికి రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.15 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.20 కోట్లుగా ఒప్పందం కుదిరింది. మ్యూజియం నిర్మాణానికి లంబసింగికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాజంగి డైరీఫారం భూములు 22 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మ్యూజియం నిర్మాణ పనులకు 2021 అక్టోబరు 8వ తేదీన అప్పటి గిరిజన సంక్షేమశాఖ మంత్రి పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. కేంద్రం వాటాలో తొలి విడతగా రూ.7.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడంతో గత వైసీపీ ప్రభుత్వం వాటిని ఇతర అవసరాలకు ఖర్చు చేసింది. 2023 జనవరి నాటికి కాంట్రాక్టర్ రూ.3.5 కోట్ల పెట్టుబడి పెట్టి 30 శాతం పనులు పూర్తిచేసినా నిధులు విడుదలకాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు.



అసంపూర్తిగా మ్యూజియం బ్లాక్ భవనాలు

దీంతో కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్‌కి అందజేయడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 2023 జనవరి ఐదవ తేదీన లంబసింగి సందర్శించిన కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ డిప్యూటీ కార్యదర్శి ఆర్.మైథిలి అదే ఏడాది అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేయాలని, రాష్ట్రం వాటా నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. అయితే వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం వాటా నిధుల్లో ఒక్క పైసా కూడా విడుదల చేయకపోవడం వల్ల పనులు మందకొడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల్లో కదలిక కనిపించింది. రాష్ట్రం వాటా నిధులను కొత్త ప్రభుత్వం విడుదల చేస్తుందనే నమ్మకంతో కాంట్రాక్టర్ పనులను పునఃప్రారంభించారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఐరన్ దిగుమతి చేసుకున్నారు. రెస్టారెంట్, మ్యూజియం బ్లాక్స్ శ్లాబ్ వేసేందుకు ఐరన్ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఇసుక కొరత కారణంగా రెండు నెలలుగా పనులు ముందుకు సాగలేదు. ఈ మ్యూజియం అందుబాటులోకి వస్తే గిరిజన సాంతంత్ర్య సమరయోధుల చరిత్ర భావి తరాలకు తెలియడంతో పాటు పర్యాటకులు ఎంజాయ్ చేసేందుకు అనువుగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఇసుక కొరత తీర్చి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి పాడేరు మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు

- తొలివిడత 20 సీట్లు
- అడ్మిషన్లు 19 నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వులు
- నెలాఖరుకు మిగిలిన సీట్లు భర్తీ

-వార్త మెయిన్‌లో..



పాడేరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముస్లింల శాంతి ర్యాలీ

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం పాడేరులో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మసీద్ నుంచి మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ కూడలి, సినిమా హాలు సెంటర్ మీదుగా పీటీడీ కాంప్లెక్స్ వరకు సాగింది.

-పాడేరు రూరల్

విశాఖ-దుర్గ్ వందే భారత్ ప్రారంభం



విశాఖ నుంచి దుర్గ్‌కు బయలుదేరిన వందేభారత్ రైలు...(ఇన్‌సెట్‌లో) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ ఎం.శ్రీభరత్... -వార్త మెయిన్‌లో..

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


హుస్సేన్ (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, సెప్టెంబరు 16: ప్రియురాలితో స్వల్ప వివాదం కారణంగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని బట్టపణుకులు- నడింపాలెం గ్రామాల మధ్య గల జీడితోటలో చోటుచేసుకుంది. దీనికి సంబం ధించి కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అసోం రాష్ట్రం బొర్రపేట రోడ్డు జానియా గ్రామానికి చెందిన నాజబుల్ హుస్సేన్(20) అదే గ్రామానికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి ఎన్‌హెచ్ 516-ఈ రహదారి నిర్మాణ పనులు చేసేందుకు నాలుగు నెలల క్రితం బట్టపణుకులు గ్రామానికి వచ్చారు. వీరు ప్రస్తుతం బట్టపణుకులు గ్రామంలో కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన క్యాంపులో ఉంటూ పనులు చేస్తు న్నారు. హుస్సేన్ స్వగ్రామంలోని ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తరువాత ఆమెతో మాట్లాడుతుండేవాడని సహచరులు తెలిపారు. అదే విధంగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో అతను ప్రియురాలితో మాట్లాడాడు. ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరగడంతో అతను క్యాంపు నుంచి బయటకు వెళ్లాడని స్నేహి తులు తెలిపారు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో వారంతా చుట్టు పక్కల గాలించారు. క్యాంపునకు అర కిలోమీటరు దూరంలో గల బట్టపణుకులు- నడింపాలెం గ్రామాల మధ్య జీడితోటలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు హుస్సేన్‌ను కిందకు దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించి ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు చెప్పారు. కాంట్రా క్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో సోమ వారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన లారీ క్లీనర్ మృతి


పైలా రాము (ఫైల్‌ఫొటో)

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి సోమవారం ఉమ్మలాడ జంక్షన్ వద్ద శారదా నదిలో శవమై తేలినట్టు పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వర రావు తెలిపారు. చోడవరం మండలం జి.జగన్నాధపురం గ్రామానికి చెందిన పైలా రాము (46) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన తన అత్తవారి ఊరైన సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటకు వచ్చాడు. తన బావమరిది ఇంట్లో శుభకార్యం కూడా ఉండడంతో సాయంత్రం వరకు పనులు చేసి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించగా.. సైకిల్, మొబైల్ ఫోన్, దుస్తులు మూలపేట గ్రోయిన్ వద్ద లభ్యమయ్యాయి. కానీ అతని ఆచూ కీ లభించలేదు. దీంతో రాము అదృశ్యమైనట్టు ఇతని కుమారుడు మోహనరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా రాము మృతదేహం జాతీయ రహదారిలో ఉమ్మలాడ జంక్షన్ వద్ద శారదానది ఒడ్డున తేలిందని మోహనరావు సోమవారం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు చెప్పారు.

ఆవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని గుంటపల్లి శివారు పెద్దిపాలెం వెళ్లే ఆవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయస్సు గల పురుషుడు నిర్జీవంగా పడివున్నట్టు సోమవారం ఉదయం పాయకరావుపేట ఆర్‌.ఐ. టి.త్రినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నీటిలో ఉండడం వల్ల బాగా ఉబ్బిపోయి, ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఇతను నలుపు రంగు ప్యాంటు, సిమెంటు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు. ధరించి వున్నాడని, ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

125 లీటర్ల నాటుసారా స్వాధీనం

▸▸ బాలుడితోసహా ఒక వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 16: స్థానిక పోలీ సులు 125 లీటర్ల నాటుసారాతో ఒక వ్యక్తిని, మరో బాలుడిని అరె స్టు చేశారు. నాటుసారా రవాణా అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి మండలంలోని పెంటకోట శివారులో తాండవ నది దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ క్యాన్లలో 125 లీటర్ల నాటుసారాను పడవలో తరలిస్తుండగా గోపాలపట్నం గ్రామానికి చెందిన వాడబోయిన కొండబ్బాయిని, మరో బాలుడుని పట్టు కున్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. ఇరువురిని కోర్టులో హాజరుపరిచిన అనంతరం కొండబ్బాయిని ఎలమంచిలి సబ్ జైలుకు, బాలుడిని విశాఖ జువెనైల్ హోమ్‌కు తరలించారు.

చెరువులో పడి ఒకరి మృతి

▸▸ ప్రాణాలతో బయటపడిన మరొకరు


ఇమ్మాన్యుయేల్ (ఫైల్ ఫొటో)

పరవాడ, సెప్టెంబరు 16: ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. సీఐ జి.మల్లికార్జున రావు తెలిపిన వివరాల మేరకు.. పరవాడ ఎస్సీ కాలనీకి చెందిన జన్ని ఇమ్మాన్యుయేల్ (25), దేశపాత్రుని పాలేనికి చెందిన పి.రవికుమార్, రాజు స్నేహితులు. వీరు సోమవారం ఉదయం మద్యం సేవించిన అనంతరం సమీపంలో ఉన్న టిఫిన్ షాపు వద్ద అల్పాహారం చేశారు. రాజు టిఫిన్ షాపు వద్ద ఉండిపోగా, మిగతా ఇద్దరూ కలిసి శివాలయం సమీపంలో చెరువు గట్టుమీదుగా నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులోకి పడిపోయారు. వీరిలో ఇమ్మాన్యుయేల్ నీటిలో మునిగిపోగా, రవికుమార్ ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు ఇమ్మాన్యుయేల్‌ను బయటకు తీశారు. కానీ అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. మృతుడి మేనమామ పి.గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

పూసపాటిరేగ, సెప్టెంబరు 16: విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చోడమ్మఅగ్రహారం వద్ద జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన మిరియాల సరస్వతి(51) మృతిచెందింది. వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన సరస్వతి, బంధువు నీలాపు అనసూయలు కలిసి పని నిమిత్తం సోమవారం శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఆటోలో బయలుదేరారు. చోడమ్మఅగ్రహారం టీ టైం వద్ద దిగారు. అనంతరం సరస్వతి రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళుతున్న వ్యాన్ ఆమెను బలంగా ఢీకొంది. తలపై బలమైన గాయం తగిలి రక్తస్రావం జరగడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

▸▸ నిధులు ఇచ్చి కాపాడతామని ఒక వైపు ప్రకటన

▸▸ మరోవైపు 100 మందిని డిప్యుటేషన్‌పై ఎన్‌ఎండీసీకి పంపేందుకు రంగం సిద్ధం

▸▸ ఈ నెల 23 నుంచి 25 వరకు ఇంటర్వ్యూలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కర్మాగారానికి నిధులు సమకూరుస్తామని, వాటితో ఉత్పత్తిని మెరుగుపరచుకుని నష్టాల నుంచి బయటపడాలని ఉద్యోగులకు చెబుతోంది. మరోవైపు విశాఖపట్నంలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లలో 100 మందిని అత్యవసరంగా చత్తీస్‌గఢ్‌లోని ఎన్‌ఎండీసీకి చెందిన నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించింది. ఇందుకోసం ఈ నె 23 నుంచి 25వ తేదీ వరకు ఎన్‌ఎండీసీ అధికారులు విశాఖపట్నం కర్మాగారంలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపింది. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని సూచించింది. విశాఖపట్నం కర్మాగారంలో పనిచేస్తున్న సీనియర్లు అందరినీ ఇతర ప్లాంట్లకు పంపిచేసి...ఇక్కడ మిగిలిన వారితో ఏమి చేయాలని ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడి కర్మాగారం పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోవడం గమనించిన సీనియర్ మేనేజర్ స్థాయి అధికారులు 200 మంది ఇప్పటికే రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రతి నెలా సగటున 20 మంది పదవీ విరమణ చేస్తున్నారు. మరోవైపు నియామకాల ప్రక్రియ చాలాకాలం క్రితమే ఆపేశారు. దీంతో ఇప్పటికే కీలక విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్లాంటును పూర్తి స్థాయిలో నడపాలంటే ప్రస్తుతం 300 మంది ఇంజనీర్లు అవసరమని, కనీసం కాంట్రాక్టు ప్రాతిపదికనైనా నియమించుకోవడానికి అనుమతి ఇవ్వాలని గత ఏడాది నాటి సీఎండీ అతుల్ భట్ ఉక్కు మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగా, ఉన్నవారిని దశల వారీగా ఇతరచోట్లకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇంకో వైపు స్వచ్ఛంద పదవీ విరమణకు కూడా నిధులు ఇస్తామని చెబుతున్నారు.

ఇదంతా కుట్ర

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

కేంద్రం చేపడుతున్న చర్యలు చూస్తుంటే...విశాఖపట్నం ప్లాంటులో ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఏదో కంటితుడుపుగా కొంత ఆర్థిక సాయం చేసి, నష్టాల నుంచి బయటకు రాలేకపోయారు కాబట్టి...ఇక ఏమీ చేయలేమని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నారు. అలాకాకుండా ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూరిస్తే 100 శాతం ఉత్పత్తితో ఈ గండం నుంచి గట్టెక్కిస్తాం.

కొనసాగుతున్న ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

▸▸ 15 మీటర్లు పొడవున గండి ▸▸ 50 క్యూసెక్కుల నీరు వృథా

మాకవరపాలెం, సెప్టెంబరు 16: ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు రెండో రోజూ కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం రాచపల్లి 99.6 కిలోమీటరు వద్ద 10 మీటర్ల వెడల్పున గండి పడిన సంగతి తెలిసిందే. అయితే జీవీఎంసీ అధికారులు గండి పూడ్చివేత వెంటనే ప్రారంభించినప్పటికీ నీటి ఉధృతికి పనులు ముందుకు సాగలేదు. ఆదివారం రాత్రి నాటికి గండి పూడ్చివేత పూర్తవుతుందని అధికారులు భావించినప్పటికీ నీటి ప్రవాహం మరింత పెరిగి గండి మరో 5 అడుగులు వెడల్పు పెరిగింది. సోమవారం ఉదయం నుంచి మట్టిని గోని సంచుల్లో నింపి గండి పనులు పూర్తి చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే నీటి ప్రవాహాన్ని అడ్డుకట్టు వేసేందుకు కొండలఅగ్రహారం, తామరం వద్ద ఏలేరు కాలువకు గండ్లు కొట్టి నీటిని మళ్లించారు. గండి వల్ల 50 కూసెక్కులు నీరు వృథాగా పోయిందని, మంగళవారం నాటికి పనులు పూర్తి చేస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.


ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు చేస్తున్న దృశ్యం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో సమగ్ర అభివృద్ధి

▸▸ దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని మోదీ కృషి

▸▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


ఎంపీ సీఎం రమేశ్‌కు ఏటికొప్పాక కళాఖండాన్ని బహూకరిస్తున్న మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి

ఎలమంచిలి, సెప్టెంబరు 16: దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ విశేష కృషి చేస్తున్నారని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇటు రాష్ట్రాన్ని, అటు దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు చురుగ్గా జరగాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి మాట్లాడుతూ, జాతీయ రహదారి నుంచి ఏటికొప్పాక వరకు రోడ్డును బాగు చేయించాలని, రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని, లక్కబొమ్మల కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. సీఎం రమేశ్ బదులిస్తూ.. ఏటికొప్పాక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఆయన లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మెడికల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఎంపీ సీఎం రమేశ్‌కు వినతి


ఎంపీ సీఎం రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికులు

కొత్తూరు (అనకాపల్లి), సెప్టెంబరు 16: జిల్లాలో ఉన్న ఎనిమిది ప్రభుత్వ వైద్య విభాగాల్లో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేశ్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ, కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వడంలేదని, వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని కుంటిసాకులు చెబుతున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలుచేసి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 30వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, సుధీర్, వడ్డాది ఈశ్వరరావు, వినోద్‌కుమార్, విజయ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

గంప సీతాఫలాలు రూ.500


మాడుగుల సంతకు వచ్చిన సీతాఫలాలు

మాడుగుల, సెప్టెంబరు 16: ఏజెన్సీ నుంచి గిరి రైతులు తీసుకువచ్చిన సీతాఫలాల ధర ఆశాజనకంగా ఉంది. మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతకు దేవాపురం, సలుగు, ఈదులపాలెం, కందులమామిడి, కక్కి, వంటలమామిడి వంటి గిరిజన ప్రాంతాల నుంచి గిరిజన రైతులు గంపలు, తట్టల్లో సీతాఫలాలను తీసుకు వచ్చారు. అయితే ఒక్కో సీతాఫలం గంప రూ.400 నుంచి రూ.500 వరకూ విక్రయించారు. ఒక తట్టలో 50 సీతాఫలాలు ఉంటాయి. దీంతో ఈ వారం సీతాఫలం ధర ఆశాజనకంగా ఉందని గిరి రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

కరాటే పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

పరవాడ, సెప్టెంబరు 16 : స్టీల్ ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఇటీవల నిర్వహించిన నాలుగో రాష్ట్రస్థాయి కుడో చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్టు కోచ్ జి.పుష్పారావు తెలిపారు. టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, గొర్లి వంశీ, అన్సుజా, అక్షితవర్మ, సునైన, రిత్విక్, కె.ప్రవర్షిత, ఎం.కార్తీక్, కె.దీక్షిత, డీఏ గౌతమ్, కె.ఫణీంద్రకుమార్, బి.మణికంఠ, ఎన్.లీలా, ఎన్.గోపాల్‌కుశాల్ బంగారు పతకాలు సాధించారు. వీరికి కుడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మహేశ్వారా, ప్రధాన కార్యదర్శి జాస్మిన్‌మక్వానా చేతుల మీదుగా పతకాలు అందజేశారు. ఈ ఏడాది నవంబరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని కోచ్ తెలిపారు.

నాలుగు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 16 : నాలుగు కిలోల గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు మాడుగుల ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని ముకుందపురం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆ సమయంలో సత్యసాయి జిల్లాకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తున్నాడని, అనుమానంతో అతనిని ఆపి బ్యాగ్ తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయని చెప్పారు.

వివాహిత కిడ్నాప్‌నకు యత్నం

▸▸ ఆటోలో బలవంతంగా తీసుకువెళుతుండగా కేకలు వేసిన బాధితురాలు

▸▸ వాహనాన్ని అటకాయించిన స్థానికులు

▸▸ ఆమెను వదిలి పరారైన నిందితులు

▸▸ రౌడీషీటర్ సహా మరొకరి అరెస్టు

పెందుర్తి, సెప్టెంబరు 16: వివాహితను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన రౌడీ షీటర్‌తో పాటు అతడికి సహకరించిన మరొకరిని సోమవారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన వివాహిత ఇటీవల వేపగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న తన బాబాయి ఇంటికి వచ్చింది. పెందుర్తి జేఎన్‌ఎన్‌ఎంయూఆర్ కాలనీకి చెందిన నాగుల మోహన్ (27), అతడి స్నేహితులు మరో ఇద్దరు సోమవారం వివాహిత బాబాయి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న ఆమెను బెదిరించి బలవంతంగా అక్కడ నుంచి తీసుకువెళ్లేందుకు యత్నించగా...ఆమె ప్రతిఘటించసాగింది. ఈలోగా బయటకు వెళ్లిన ఆమె బాబాయి వచ్చి అడ్డుకోగా నాగుల మోహన్, అతడి స్నేహితులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అనంతరం వివాహితను బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకుని వచ్చి ముందుగా సిద్ధం చేసుకున్న ఆటోలో చినముషిడివాడలో గల స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆటో శారదా పీఠం సమీపంలోకి వచ్చేసరికి వివాహిత బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు కొందరు గమనించి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో దొరికిపోతామని భావించిన మోహన్, అతడి స్నేహితులు ఆటోలో నుంచి వివాహితను కిందకు తోసేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆమె జరిగిన విషయాన్ని తన భర్తకు సమాచారం అందించగా...ఆయన 100కు డయల్ చేశారు. సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ స్వామినాయుడు అక్కడకు చేరుకున్నారు. ఆమె ద్వారా సమాచారం సేకరించి కిడ్నాప్‌నకు యత్నించిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చినముషిడివాడలో నాగుల మోహన్‌ను, అతనికి సహకరించిన చినముషిడివాడ పాత ఊరుకు చెందిన నందవరపు కుమార్ (28) పట్టుబడ్డారు. మోహన్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ ఉందని, అది ఇటీవల పెందుర్తి పీఎస్‌కు బదిలీ అయ్యిందని సీఐ తెలిపారు. మరో నిందితుడు కుమార్ లారీ డ్రైవర్ అని అన్నారు. కిడ్నాప్ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని ఆచూకీ కోసం వెదుకుతున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ అన్నారు

దూర్వగణపతి అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

▸▸ ముగిసిన స్వయంభూ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు


దూర్వగణపతి అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం, సెప్టెంబరు 16: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వయంభూ విఘ్నేశ్వరుడు దూర్వగణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చలపతి ముగింపు ఉత్సవాల సందర్భంగా స్వామివారిని అలంకరించారు. స్వయంభూ విఘ్నేశ్వరుడు నవరాత్రి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు హాజరై పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఈవో సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఉప్పల సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు చలపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పుటేరును పరిశీలించిన అధికారులు


ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సీతారామరాజు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి, సెప్టెంబరు 16: మండలంలో ఉప్పుటేరు వరదతో నీటమునిగిన అమలాపురం నుంచి సముద్ర తీరానికి వెళ్లే రహదారిని సోమవారం ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.సీతారామరాజు, గ్రామ కార్యదర్శి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఉప్పుటేరు పొంగడంతో రహదారి నీట మునిగిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా కలెక్టర్ స్పందించారు. తక్షణమే ఉప్పుటేరును పరిశీలించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సీతా రామరాజును ఆదేశించారు. దీంతో ఆయన ఉప్పుటేరును, నీట మునిగిన రహదారిని పరిశీలించారు. సముద్రం ఆటు, పోటుల వల్ల ఉప్పుటేరులోకి అధిక మొత్తంలో నీరు వచ్చిందని స్థానికులు చెప్పారు. నీటి ప్రవాహం తగ్గిన తరువాత మట్టితో రోడ్డు ఎత్తు పెంచాలని సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఆయన సూచించారు.

నేటి నుంచి సదరం క్యాంప్

▸▸ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హతకు వెరిఫికేషన్

▸▸ ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్


డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16: ఈ నెల మొదటి వారంలో భారీ వర్షాల కారణంగా వాయిదా వేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హత వెరిఫికేషన్ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి పునః ప్రారంభమవుతుందని అనకాపల్లి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మండలాల వారీగా క్యాంప్ నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన సబ్బవరం, కె.కోటపాడు, 18న నర్సీపట్నం, పాయకరావుపేట, 19న కశింకోట, ఎలమంచిలి, 20న కోటవురట్ల, నక్కపల్లి, 21న నాతవరం, గొలుగొండ, 23న రావికమతం, రోలుగుంట, 24న దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, 25న ఎస్.రాయవరం, మాకవరపాలెం, 26న చీడికాడ, మాడుగుల మండలాలకు చెందిన దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అర్హత పరిశీలన, పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

జాతీయ యోగా పోటీలకు గురుకుల పాఠశాల బాలికలు


పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు

పరవాడ, సెప్టెంబరు 16: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో భీమిలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు సత్తా చాటారు. ఈ పాఠశాల నుంచి యోగా పోటీల్లో ఏడుగురు పాల్గొనగా నలుగురు పతకాలను సాధించారు. 12-14 ఏళ్ల విభాగంలో బి.వైష్ణవి బంగారు, ఎస్.కౌశిక కాంస్యం, 14-16 ఏళ్ల విభాగంలో కె.వెంకట వైష్ణవి రజత, కె.భావన కాంస్య పతకాలు సాధించారు. ఈ ఏడాది అక్టోబరులో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని పాఠశాల యోగా కోచ్ ఆంజనేయులు తెలిపారు.

అనకాపల్లిలో సినిమా షూటింగ్ సందడి


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 : 'అనకాపల్లి' పేరు మీద నిర్మించే సినిమాలోని కొన్ని సన్నివేశాలను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చిత్రీకరించారు. నక్కిన నేరేటిక్స్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించి హీరో విక్రమ్, హీరోయిన్ సంధ్య మధ్య ప్రేమ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రానికి కథ, స్ర్కీన్‌ప్లే నక్కిన త్రినాథరావు, డైరెక్టర్‌గా ఖగేష్ తమ్మినేని వ్యవహరిస్తున్నారు.

అల్లూరి అనుచర వారసులకు గృహ యోగం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుల వారసులకు ఎట్టకేలకు పక్కా ఇళ్లు సమకూరనున్నాయి. ఎందరో నాయకులు.. మరెందరో ప్రముఖులు.. ఇంకెందరో అధికారులు పరామర్శల సందర్భాల్లో ఇచ్చిన హామీలకు మోక్షం లభించకపోయినా, ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం మానవతా దృక్పథంతో వారికి గృహ యోగం కలుగుతుంది. వారు నివాసం ఉంటున్న బట్టపణుకుల పంచాయతీ పరిధిలోని లంకవీధి గ్రామానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో చేపట్టిన గృహ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

- రూ.2 కోట్ల వ్యయంతో పక్కా ఇళ్ల నిర్మాణం
- ఎన్‌సీసీ కంపెనీ యాజమాన్యం ఔదార్యం
- విజయదశమి నాటికి ప్రారంభానికి సిద్ధం



అల్లూరి అనుచరుల వారసులకు నిర్మించిన శాశ్వత గృహాలు ఇవే...

కొయ్యూరు, సెప్టెంబరు 16:

అల్లూరి అనుచరుడు గాం గంటందొర వారసులైన ఐదుగురు సంతానానికి చెందిన 11 కుటుంబాలు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నాయి. సరైన ఇళ్లు కూడా లేకపోవడంతో విపత్కార పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక రోజులు, సందర్భాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు వారిని పరామర్శించి ఇచ్చిన హామీలను అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వాలు కూడా వారిని గుర్తించిన పాపానికి పోలేదు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ ఎండీ ఏవీ రంగరాజు వీరికి పక్కా గృహాలు నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు.

రెండు బహుళ అంతస్తుల్లో 12 గృహాలు

గత ఏడాది నవంబరులో రూ.2 కోట్లతో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రెండు బహుళ అంతస్తులు నిర్మించి ఒక్కో భవనంలో ఆరు కుటుంబాలకు వసతి కల్పించేలా నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో కుటుంబానికి రెండు పడక గదులు, హాలు, కిచెన్‌తో కూడిన వసతిని 1250 చదరపు అడుగులలో నిర్మాణాలు చేశారు. 11 కుటుంబాలకు ఇందులో వసతి కల్పించేందుకు సిద్ధం చేస్తున్నారు. మిగిలిపోయిన ఒక్క గృహాన్ని కూడా ఆయా కుటుంబాల్లో జరిగే శుభకార్యాలకు వినియోగించుకునేలా క్లబ్ హౌస్ ఏర్పాటు చేశారు.

పునాది పడిందిలా...

ఎన్‌సీసీ కంపెనీ చైర్మన్ ఏవీఎస్ రాజు కోనసీమ జిల్లాలో అంతర్వేది పాలెంలో నిరుపేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించారు. అయితే రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో అల్లూరి అనుచర వారసుడు, గంటందొర మనుమడు గాం బోడిదొరను అప్పటి రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కరించారు. ఈ సమయంలో అల్లూరి అనుచరుల వారసుల దీనస్థితిని నర్సీపట్నానికి చెందిన క్షత్రియ సేవా సంఘం ప్రతిధులు ఏసీసీ కంపెనీ ప్రస్తుత ఎండీ ఏవీఎస్ రాజు కుమారుడు ఏవీ రంగరాజుకు వివరించారు. నిలువనీడ లేక ఇబ్బంది పడుతున్న వీరికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరటంతో అందుకు ఆయన అంగీకరించారు. ఆ వెంటనే క్షత్రియ సంఘం చొరవతో నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పునాది పడింది.

విజయదశమి నాటికి సిద్ధం

గత ఏడాది నవంబరులో ఏసీసీ కంపెనీ ప్రతినిధులు వచ్చి చూసి ఆరు కుటుంబాలకు ఒక భవనం, మిగిలిన ఐదు కుటుంబాలకు మరో భవనం నిర్మించేలా పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు తదిదశకు చేరాయి. విజయదశమి నాటికి ప్రారంభించేలా వీటిని సిద్ధం చేస్తున్నారు. దీంతో గంటం దొర వారసులైన బుచ్చిదొర, లక్ష్మణదొర, బోడిదొర, తెల్లనదొర, సోమన్నదొరలకు చెందిన 11 మంది సంతానం పెంటన్నదొర, బాబూరావు, నీలకంఠం, రాంబాబు, దార మల్లేశ్వరి, బోడిదొర, సీతరామయ్య, సీతమ్మ రాజబాబు, మలయ్యమ్మ, శివలకు ఎట్టకేలకు శాశ్వత గృహాలు సమకూరనున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇంతవరకు పూరిపాకలకు పరిమితంగా జీవనం సాగిస్తున్న తమకు నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ పుణ్యమాని శాశ్వత గృహాలు సమకూరుతుండడంతో ఆయా కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యుత్ సదుపాయం కల్పనే తరువాయి..

కాగా ఈ గృహ నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చినా విద్యుత్ సౌకర్యం మాత్రం లేదు. ఈ సదుపాయం కల్పించేలా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ విషయమై ఇప్పటికే ఆయా కుటుంబాలు అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను, ఐటీడీఏ పీవో అభిషేక్‌ను కలసి విన్నవించారు. దీంతో విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే చేసి మిన్నకున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ఎన్‌సీసీ వారు నిర్మిస్తున్న భవన సముదాయానికి విద్యుత్ కల్పనకు వీలుగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధి సురేంద్ర

జీవో-3 చట్టబద్ధతపై ఆర్డినెన్స్ తీసుకురండి

- గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

పాడేరు రూరల్, సెప్టెంబరు 16: రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జీవో నంబరు-3 చట్టబద్ధతపై ఆర్డినెన్స్ తీసుకురావాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు మాట్లాడుతూ జీవో-3పై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏం చెప్పలేకపోతున్నానని, ఎన్నికల అనంతరం స్పష్టమైన ప్రకటన చేస్తానని ఇచ్చిన హామీని తక్షణమే ప్రకటించాలన్నారు. అలాగే ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు కేబినెట్ ఆర్డినెన్స్ తీసుకురావాలని, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అతని వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా నాయకుడు పాలికి లక్కు ఉన్నారు.

శరవేగంగా చోడిరాయి వంతెన అప్రోచ్ పనులు



వంతెన అప్రోచ్ పనులు చేపడుతున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 16: గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చోడిరాయి వంతెన అప్రోచ్ పనులను సోమవారం యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. చోడిరాయి, మాదిమళ్ల వంతెనలు వరద ధాటికి కొట్టుకుపోయి 60 గ్రామాలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయని ఈ ప్రాంత గిరిజనులు ఇటీవల ఇక్కడికి వచ్చిన సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమస్యను సదరు అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో త్వరితగతిన చోడిచాయి, మాదిమళ్ల వంతెనల అప్రోచ్ పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డీఈ కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీబీలతో చోడిరాయి వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే ధారకొండ పంచాయతీలోని చీడిగుంట, కమ్మరితోట, తోకరాయి గ్రామాల్లో దెబ్బతిన్న చేతిపంప్‌లను, పైప్‌లైన్ల మరమ్మతు పనులను నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, గుమ్మిరేవుల, ధారకొండ సర్పంచులు కమలమ్మ, ఎస్.రాజు, ఎంపీటీసీ సభ్యుడు రామన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ ఆర్థిక సాయం



ధారాపురంలో బియ్యం, సరకులు అందిస్తున్న సత్యనారాయణమూర్తి, నేతలు

సీలేరు, సెప్టెంబరు 16: గూడెంకొత్తవీధి మండలంలోని వరద బాధితులకు సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. సోమవారం సీపీఐ రాష్ట్ర సహాయం కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో బాధిత గిరిజనులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి బియ్యం, నిత్యావసర సరకులు, నగదు పంపిణీ చేశారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకున్న వందలాది ఎకరాల భూమి భారీ వర్షానికి నామరూపాలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చాలా చోట్ల ఇళ్లు, పశువులు కోల్పోయారని వాపోయారు. వారికి సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.విష్ణుమూర్తి, సభ్యులు కిల్లో భగవాన్, గోవింద్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ధారకొండ వర్తక సంఘం అధ్యక్షుడు నానాజీ ఆధ్వర్యంలో సభ్యులు బాధిత గిరిజనులకు బియ్యం, నిత్యావసర సరకులను అందించారు. దాదాపు 25 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, రూ.2 వేల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎ.శ్రీనివాసరావు, చిన్నారి, కిశోర్, నరేష్, యర్రా ధారబాబు పాల్గొన్నారు. దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని జోన్నమామిడి, గాలికొండ గ్రామాల్లో సర్వం కోల్పోయిన బాధితులకు సీలేరుకు చెందిన పలువురు దాతలు బియ్యం, సరకులు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. సీలేరు పోస్టు మాస్టర్ ప్రసాదరావు, జూనియర్ కాలేజీ అధ్యాపకులు ఎ.సాయిరామ్, జెన్‌కో ఉద్యోగి, తెలుగునాడు కార్మిక సంఘ నేత ఎస్.వరప్రసాద్ ఈ సరకులు అందించారు.

చట్రాపల్లి గిరిజనులకు నిత్యావసర సరకులు

గూడెంకొత్తవీధి: మండలంలోని చట్రాపల్లి వరద బాధితులకు జనసేన నాయకులు సోమవారం నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. ప్రతీ కుటుంబుంబానికి బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్ మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాలతో చట్రాపల్లి గిరిజనులకు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.బాలరాజు, నాయకులు ఎ.కోటేశ్వరరావు, శ్రీను, రవి, భూషణం పాల్గొన్నారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు



ముంచంగిపట్టు: జోలాపుట్టులో కేక్ కట్ చేస్తున్న ముస్లిం సోదరులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 16: శాంతిసామరస్యాలను బోధించిన మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిక్రే ఆలాహీ మస్జిద్ గురువు మహమ్మద్ ఆలీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జూలుస్ (ర్యాలీ) చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మస్జిద్ గురువు మాట్లాడుతూ విగ్రహం, చిత్రపటం లేకపోయినా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ప్రవక్త మహ్మద్ అన్నారు. ప్రతి ఏటా మిలాద్ ఉన్ నబీ రోజున ముస్లిం సోదరులు అంతా ఏకమై మస్జిద్‌లో జమాత్ అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి భారీ ర్యాలీని చేపడతామన్నారు. ఈ ర్యాలీని మస్జిద్ నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ కూడలి, సినిమా హాలు సెంటర్ మీదుగా పీటీడీ కాంప్లెక్స్ వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అబ్దుల్లా, మహమ్మద్, సులేమాన్, ఇక్బాల్, మస్తాన్, షమీమ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

జోలాపుట్టులో ప్రత్యేక ప్రార్థనలు

ముంచంగిపుట్టు: మండలంలో జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని మసీదులో మిలాన్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లిం సోదరులు కేక్ టింగ్ చేశారు. సమాజాన్ని శాంతి వైపు నడిపించిన మహోన్నతులు మహ్మద్ ప్రవక్త అంటూ మిస్లిం మత పెద్దలు జాకీర్ హుస్సేన్, సులేమాన్, రాజ్‌సిలర్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా సందడిగా మిలాన్ ఉన్ నబీను జరుపుకున్నారు.

కొయ్యూరు మార్గం.. మురికి కూపం!

- ప్రధాన రహదారి బురదమయం
- వర్షాలకు క్షీణించిన పారిశుధ్యం
- ముక్కున వేలేసుకుంటున్న గిరిజనం



బురదమయంగా రాజేంద్రపాలెం-కొయ్యూరు ప్రధాన రహదారి

కొయ్యూరు, సెప్టెంబరు 16: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాజేంద్రపాలెం నుంచి కొయ్యూరు ప్రధాన మార్గం మురికికూపంలా తయారైంది. రహదారికి ఇరువైపులా నీరు నిలిచిపోయి బురదమయంగా మారింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే కొయ్యూరులోని వాల్మీకిపేట, రాజేంద్రపాలెం కమ్మరవీధి, సురేంద్రపాలెం, సంతబయలు, శింగవరం ఐటీడీఏ కాలనీ తదితర ప్రాంతాలు మురికి కూపంలా మారాయి. ఆయా వీధుల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పారిశుధ్యం క్షీణించి వ్యాధులు ప్రబలుతుండంతో గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఎస్ఈ కాంతిమతి అంతర్రాష్ట్ర రహదారి పరిశీలన

సీలేరు, సెప్టెంబరు 16: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కాంతిమతి సోమవారం పరిశీలించారు. వర్షాలకు జీకే వీధి నుంచి పాలగెడ్డ వరకు గల అంతర్రాష్ట్ర రహదారిలో కొండచరియలు విగిరిపడి, కల్వర్టులు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై పాడేరు ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు ఇటీవల పరిశీలించి జిల్లా కలెక్టర్, ఎస్ఈకి నివేదికను పంపించారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ ఎస్ఈ నివేదికలో పేర్కొన్న నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జీకే వీధి-లంకపాకల మార్గంలో దెబ్బతిన్న కల్వర్టులను, సీలేరు వరకు జారిపడిన కొండచరియలను తొలగించిన పనులను పరిశీలించారు. అలాగే సీలేరు, డొంకరాయి ప్రధాన మార్గంలో దెబ్బతిన్న వలసగెడ్డ వంతెన పనులను పరిశీలించారు. సీలేరు-ధారకొండ మార్గంలో జారిపోయిన రక్షణ గోడలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ బాలసుందరబాబు, డీఈ రామారావు, జేఈలు భరతుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

'బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి'

పాడేరు రూరల్, సెప్టెంబరు 16: బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పేర్కొన్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని పీఎంఆర్సీ భవనంలో సోమవారం నిర్వహించిన సీతారాం ఏచూరి సంతాప సభలో పాల్గొన్న ఆయన ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత సీపీఎం నేతగా ప్రపంచ దేశాల్లో కీర్తి గాంచిన మహనీయుడన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరుసాగిస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగట్టి దేశ రాజకీయాల్లో ప్రధాన పాత్రను పోషించారన్నారు. అలాగే పలువురు వక్తలు సీతారాం ఏచూరి విశిష్టతను కొనియాడారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా నాయకులు పి.లక్కు, పి.బాలదేవ్, ఎల్.సుందరరావు, వలంటీర్ల సంఘ నేతలు ఎం.చిట్టిబాబు, పి.శ్రీను, పి.కుమారి పాల్గొన్నారు.

మన్యంలో కాఫీ ఘుమఘుమలు

... 5వ పేజీ తరువాయి

ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం 2 లక్షల 72 వేల ఎకరాల్లో కాఫీ తోటలున్నాయి. అయితే వాటిలో సుమారుగా 1 లక్షా 52 వేల ఎకరాల్లో ఏడాదికి 80 వేల టన్నుల కాఫీ పండ్ల దిగుబడి వస్తుందని అంచనా. దీంతో సుమారుగా 15 వేల టన్నుల క్లీన్(పార్చిమెంట్) కాఫీ గింజలు ఉత్పత్తి అవుతున్నది. ఏడాదికి ఒక ఎకరం కాఫీ తోటతో సుమారుగా రూ.40 నుంచి 50 వేలు ఆదాయం సమకూరుతున్నది. దీంతో కాఫీ తోటల పెంపకంపై గిరిజన రైతులు ఆసక్తి చూపుతున్నారు. అలాగే సేంద్రియ పద్ధతిలో కాఫీ ఉత్పత్తి జరగడంతో ఇక్కడ ఉత్పత్తి చేసే కాఫీ గింజలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గిరాకీ ఉంది.

ఈ ఏడాది అనుకూలించిన వర్షాలు

-ఎన్.అశోక్, ఐటీడీఏ కాఫీ ఏడీ, పాడేరు



ఏజెన్సీలో ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు నెల వరకు కురిసిన వర్షాలు కాఫీ తోటలకు ఎంతో అనుకూలించాయి. దీంతో ఎకరానికి 50 కిలోల వరకు దిగుబడి పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలు తోటలను పరిశీలిస్తే దిగుబడి పెరిగిందని రైతులు తెలిపారు. అలాగే కాఫీ తోటల్లో సస్యరక్షణ, యాజమాన్య, ఆధునిక పద్ధతులు పాటిస్తే మరింత దిగుబడి పెరిగే అవకాశాలున్నాయి. నాణ్యమైన కాఫీ దిగుబడి సాధిస్తే గిరిజన రైతుల ఆదాయం రెట్టింపవుతుంది. కాఫీ బోర్డు, ఐటీడీఏ సహకారంతో గిరిజన రైతులు మరింత అభివృద్ధి సాధించాలని కోరుతున్నాం.

వంతెనపై రక్షణ గోడ శిథిలం



చుట్టుమెట్ట సమీపంలో రక్షణ గోడ లేని వంతెన

పెదబయలు, సెప్టెంబరు 16: మండలంలోని అరడకోట పంచాయతీలో అరడకోట-చుట్టుమెట్ట మధ్య దశాబ్దాల నాటి వంతెనపై రక్షణ గోడ కూలిపోయింది. దీంతో అటుగా ప్రయాణించాలంటే వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్గంలోనే ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు అనునిత్యం తిరుగుతున్నా రక్షణ గోడ విషయం పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి వంతెన మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు.

పెదపాడు మెటల్ రోడ్డు అధ్వానం



కోతకు గురైన పెదపాడు రోడ్డు

డుంబిగుడ, సెప్టెంబరు 16: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు కోతకు గురైంది. చాపరాయి గెడ్డ నుంచి పెదపాడు వరకు గత ఏడాది మెటల్ రోడ్డు నిర్మించారు. ఇది జరిగి ఏడాది కాకముందే వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. నాణ్యతాప్రమాణాలను పాటించకుండా నిర్మాణం జరగడంతోనే రోడ్డు కొట్టుకుపోయిందని గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు రోడ్డు పూర్తికాకుండానే కాంట్రాక్టర్‌కు చెల్లించేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కోతకు గురైన రోడ్డును పూర్తిగా మరమ్మతు చేసి రవాణా సదుపాయం కల్పించాలని స్థానిక ప్రజలు కోరారు. లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

నేటి నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 3.8 లక్షల మాత్రలు సిద్ధం

పాడేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాలయాల్లోని విద్యార్థులకు వేసేందుకు 3 లక్షల 80 వేల ఆల్బెండజోల్ మాత్రలను సిద్ధం చేశారు. ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న 3,124 విద్యాలయాలు, 3,214 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 33,5,190 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలనే లక్ష్యంతో వైద్యారోగ్య శాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పీహెచ్‌సీ వారీగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మంగళవారం నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి కార్యాచరణపై సబ్‌సెంటర్ల వారీగా వైద్యారోగ్య శాఖాధికారులు పారామెడికల్ సిబ్బందికి సమాచారం అందించారు. అలాగే గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

పర్యాటక పురస్కారాలకు దరఖాస్తులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 16: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 2023-24 సంవత్సరానికి వివిధ విభాగాల్లో పురస్కారాలకు అర్హులైన పర్యాటక రంగ వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా పర్యాటక అధికారి జి.దాసు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే 38 విభాగాల నుంచి 41 పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏపీ టూరిజం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన వాటిని ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పోరేషన్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడకు ఈ నెల 22లోగా పోస్టు లేదా వ్యక్తిగతంగా అందించాలని సూచించారు.

కాఫీ గింజలకు గరిష్ఠ ధరలు

జీసీసీ డీఎం దేవరాజు



చింతపల్లి, సెప్టెంబరు 16: గిరిజన రైతులు పండించిన కాఫీ గింజలను గరిష్ఠ ధరలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాఫీ పండ్లకు మ్యాక్స్ ద్వారా పార్చిమెంట్, చెర్రీ గింజలకు ఐటీడీఏ, గిరిజన సహకార సంస్థ వేర్వేరుగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుండగా, ఈ ఏడాది సంయుక్తంగా కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. గత ఏడాది మ్యాక్స్ కిలో పండ్లకు రూ.43 ధర అందించగా, జీసీసీ పార్చిమెంట్ కిలోకి రూ.280, చెర్రీ రూ.145 ధరకు కొనుగోలు చేసిందన్నారు. వచ్చే నెల నుంచి గిరిజన గ్రామాల్లో జీసీసీ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజనులు పండించిన కాఫీ గింజలన్నీ కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన మరుసటి రోజు రైతుల వ్యక్తిగత ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి అదృశ్యం



విద్యార్థి భీమరాజు

చింతపల్లి, సెప్టెంబరు 16: స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-2 పదో తరగతి విద్యార్థి కించే భీమరాజు అదృశ్యమైనట్టు ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. గత నెల 24న అనారోగ్యం కారణంగా హెచ్ఎం అనుమతితో స్వగ్రామం జి.మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ సీకోంబందకు వెళ్లిన భీమరాజు, మరలా ఈ నెల 10న పాఠశాలకు వెళ్తానని తండ్రి వద్ద రూ.500 తీసుకుని బయలు దేరాడని చెప్పారు. అయితే బాలరాజు పాఠశాలకు హాజరుకాలేదని ఉపాధ్యాయులు తెలపగా, అన్ని చోట్లా వెతి కినా ఆచూకీ లేదని తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థి వివరాలు గుర్తించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి బ్యాటరీ పరీక్షలు

అరకులోయ, సెప్టెంబరు 16: అరకులోయ బాలుర గురుకుల క్రీడా పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి మంగళవారం బ్యాటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఐదో తరగతిలో 30 సీట్లు, ఏడో తరగతిలో ఎనిమిది, తొమ్మిదో తరగతిలో మూడు సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకున్న మంగళవారం క్రీడా పాఠశాల ప్రాంగణంలో జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు స్కూల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలని తెలిపారు. జోనల్ స్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన వివరించారు.

ఎ.ధారకొండలో సెల్‌ఫోన్ల మూగనోము

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 16: అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో సెల్ ఫోన్లు మూగబోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక ఎయిర్‌టెల్ టవర్ సోలార్ ప్యానల్ ధ్వంసమైంది. దీంతో వారం రోజులుగా పంచాయతీ పరిధిలోని గిరిజనులకు సెల్ సంకేతాలు అందుబాటులో లేవు. ఫలితంగా స్థానిక ప్రజలకు బాహ్యసంబంధాలు తెగిపోయాయి. ఇప్పటికైనా పాడేరు ఐటీడీఏ, ఎయిర్‌టెల్ అధికారులు స్పందించి టవర్ మరమ్మతు చేపట్టి సిగ్నల్స్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 16: వినాయక ఉత్సవాల సందర్భంగా అల్లూరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. మండల నలుమూలలతో పాటు సరిహద్దు ప్రాంతాల నుంచి చిన్నారులు, యువతీ, యువకులు పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్, జూనియర్స్, సోలో, డ్యూయెట్, గ్రూపుల వారీగా డాన్స్ పోటీలను నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో జూనియర్స్ సింగిల్స్‌లో హిమనందిని విజేతగా నిలిచింది. సౌమ్య, శాన్వి తర్వాత స్థానాల్లో నిలిచారు. విజేతలకు వెలుగు ఏపీఎం దేవమంగ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సురేష్ బహుమతులను అందించారు.